‘ఇదెక్కడి కర్మే....ఒకడిని వదుల్చుకుని ఇంకొకడ్ని తగిలించుకున్నాం....’ అంది లక్ష్మి తలకొట్టుకుంటూ.

నువ్వేం కంగారుపడకు....ఇందాకటి వాడు రౌడీ వెధవ కాబట్టి కంగారు పడ్డాను. ఇలాంటి వెధవల్ని సులభంగా టాకిల్ చెయ్యగలను.....’ అంది సరోజ లక్ష్మి చేతిని నొక్కుతూ.

అతను వాళ్ళ వెనకాలే నడుస్తూ రెండర్థాలు వచ్చే మాటలు పచ్చిగా వదుల్తూ ఈలవేస్తున్నాడు.

సరోజ హఠాత్తుగా వెనక్కి తిరిగి అతని వంక చూసి పకాల్మని నవ్వింది.

అతను తెల్లబోయాడు. లక్ష్మి అంతకంటే తెల్ల బోయింది.

సరోజ ఇంకా విరగబడి నవ్వింది.

‘ఏమిటి....ఏమైంది....’ అన్నాడు అయోమయంగా.

అతను వెర్రిచూపులు చూశాడు.

‘మీ ముక్కుమీద నల్లగా మసి....ఇందాకట్నించీ చూస్తున్నా...నవ్వితే  బావుండదని ఆపుకున్నా....ఇంకా ఆపుకోవడం నావల్లకాదు....’

మళ్ళీ నవ్వుతూ తెల్లబోయి చూస్తున్న లక్ష్మిఇ చెవిలో ‘నువ్వు కూడా నవ్వు....’ అంటూ జబ్బల దగ్గర గట్టిగా గిల్లేసింది.

లక్ష్మి ‘కెవ్వు....’ అని గట్టిగా అరిచి జబ్బ తడుముకుంది.

‘ఏమిటే అలా అరుస్తావ్.... పిచ్చిముండ. మీ ముక్కుమీద మసిచూసి జడుసుకుందండీ.....ఆయనలా జోకర్‌లా ఉంటే నవ్వాలిగానీ జడుసుకుంటావేంటే....’ అంటూ ఆయనకి కనబడకుండా లక్ష్మికి కితకితలు పెట్టింది సరోజ.

లక్ష్మి కూడా పకపక నవ్వింది.

ఊహించని ఈ పరిణామానికి అతడు కన్‌ఫ్యూజ్ అయిపోయి అతని నవనాడులూ స్థంభించిపోయాయి.

ఏంచేయ్యాలో తోచక బుర్రగోక్కుని కాస్తజుట్టుపీక్కుని తలవిదిలించి కళ్ళు మిటకరించి చూశాడు.

‘కావాలంటే అదిగో.....ఈ పక్కనే ఉన్న అద్దాల షాపులోకి వెళ్ళి చూస్కోండి....’ అంది సరోజ పైటకొంగుని నోట్లో పెట్టుకుని నవ్వాపుకుంటూ.

అతను తడబడే అడుగుల్తో అద్దాల షాపులోకి వెళ్ళాడు.

‘ఏంలాభం.....వాడు అద్దంలో ముఖం చూసుకుని వెంటనే వచ్చేస్తాడు’ అంది లక్ష్మి.

‘అది అంత తేలికైన విషయం అనుకున్నావా?.... ఆ షాపువాడు కస్టమర్లని ఒకపట్టాన వదలడు.... ఏదో ఒకటి అంటగడ్తాడు.... ఈలోగా మనం జారుకోవచ్చు....నేనోకసారి ఆ షాప్‌కి వెళ్ళా....’

ఇద్దరూ త్వరత్వరగా ముందుకు అడుగులు వేశారు.

ఆయన అద్దాలమ్మే షాపులోకి అడుగు పెట్టీ పెట్టగానే షాపులోని కుర్రాళ్ళు ఇద్దరు ఎదురొచ్చి ఆయన చెరోరెక్కాపట్టుకుని బరబరా లాక్కొచ్చి కుర్చీలో కూర్చోబెట్టేశారు.

'రాంగ్రీ సాబ్...ఔంగ్రీ .... ఆయియే ఆయియే....' అన్నాడు షాపు ఓనరు రెండు చేతులూ బారచాపి ఆయన్ని కౌగిలించుకుంటూ.

ఆయన కంగారు పడిపోయాడు.

'ఒక్కసారి అద్దం ఇస్తారా?' అన్నాడు.

'అర్రె!! ఒక్కసారి ఏం ఖర్మ సాబ్ .... ఇక్కడ పదిసార్లు చూస్కోండి.... ఇంటికి తీస్కెళ్ళి వందసార్లు చూస్కోడి....'

అబ్బే.... నేను అద్దం కొనడానికి రాలేదు....ఓసారి ముఖం చూస్కుని వెళ్ళిపోదామని వచ్చాను' అని లేచి నిలబడి గోడలకి తగిలి ఉన్న అద్దాలలో తన ముఖం చూస్కుని 'మోసం .... దగా' అని గట్టిగా అరిచాడు.

షాపు ఓనరు కుర్రాళ్ళకి కన్ను కొట్టాడు. వాళ్ళు ఆయన భుజాలమీద చేతులేసి గట్టిగా నొక్కి కూర్చోబెట్టేశారు.

కుర్చి ముందు టేబుల్ మీద ఒక అద్దం ఉంది. దాన్ని తీసి అందులో కూడా మళ్ళీ ముఖం చూసుకుని 'కుట్ర.... దగా.... మోసం ....' అని అరిచాడు.

షాపు  ఓనరు ఆయన చేతిలోని అద్దం లాక్కుని వెనక్కి దాచేసి 'హిహిహి.... ఇండ్ల మోసం .....దగా ఏమున్నది సాబ్....గవన్నీ బిల్‌కుల్ చీప్ వెరైటీ ఉన్నది..... అందుకనే ముఖం గట్ల వంకర్ టింకర్‌గా కన్పిస్తది.... మంచి క్వాలిటీవి ఉన్నాయ్....గవి తీస్కోడి....ఇండ్ల ముఖం ఉన్నదున్నట్టు కన్పిస్తది...అర్రే.....బడేసాబ్‌కి మంచి అద్దాలు చూయించండ్రి రా.....'

'అబ్బే...నాకు అద్దాలూ వద్దూ..... ఏమీవద్దూ ..... నేనొస్తా..... ' అంటూ లేచాడు, కుర్రాళ్ళిద్దరూ కిందకి నొక్కేశారు.

'అర్రే గట్ల పరేషాన్ అవుతావెందుకు సార్.... ముఖం వంకర్‌గా అగపడని అద్దాలు చూయిస్తాం.... తీస్కోండి.... అర్రే..... సార్‌కి చా తాపించండ్రా....'

ఆయనకి కంగారు పుట్టింది.....ఏదో ఒకటి కొనందే వదిలేలాలేడు. ఆలస్యం చేస్తే లాభంలేదు అవతల అమ్మాయిలు వెళ్ళిపోతున్నారు.

'నాకు టీ వద్దుగానీ నేను ఈ అద్దం తీస్కుంటా'అన్నాడు ఆయన టేబులు మీదనుండి ఒక అద్దం తీస్తూ అది ఆడవాళ్ళు హ్యాండ్ బ్యాగ్ లో పెట్టుకునే చిన్న అద్దం.

'గిది మీకెందుకు సాబ్....'

'నాక్కాదు.....మా అమ్మాయికి. చెప్పు ఎంత?'

'అయిదు రూపాయల్....'

షాపు ఓనర్ చేతిలో అయిదు రూపాయలు పెట్టి బయటికి పరుగు రీశాడు ఆయన.

లక్ష్మి వెనక్కి తిరిగిచూసి కెవ్వుమంది.

‘ఏమైంది?’ అది సరోజ కంగారుగా.

‘వాడు అంతదూరంలో ఉరుకులు పరుగులు పెడుతూ వస్తున్నాడే..... అద్దాల షాపువాడ్ని త్వరగానే వదిలించుకున్నాడు.’

‘మనల్ని చూశాడా?.....’ నడకవేగం పెంచుతూ అడిగింది సరోజ.

‘లేదనుకుంటా....ఈ జనంలో వాడికి కనిపించలేదు. రోడ్డుకి అటూఇటూ చూస్తూ గబగబా వస్తున్నాడు....’ అంది లక్ష్మి వెనక్కి చూస్తూ.

‘అయితే ఈ స్టూడియోలో కాస్సేపు తలదాచుకుందాం.....త్వరగా రా....’ అంటూ ప్రక్కనే ఉన్న ఫోటో సూడియోలోకి లక్ష్మి చెయ్యిపట్టు కుని లాక్కెళ్ళింది సరోజ.

అది రాంబాబు ‘ఇస్మైల్ ప్లీజ్ ఫోటో స్టూడియో’

*భలేఛాన్స్*

సీలింగ్ వైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్న రాంబాబు, ఈగలుపడ్తున్న కిష్టయ్య అలికిడికి తలతిప్పి గుమ్మం వైపు చూశారు.

సరోజనీ, లక్ష్మినీ చూసిన ఆ ఇద్దరూ ఒక్కసారి సంతోషంతో కీచుమని అరిచారు.

వీళ్ళ అరుపుకి అమ్మాయిలిద్దరూ భయపడి వెనక్కి రెండడుగులు వవేశారు.

‘అహహ....మీరలా వెనక్కి అడుగులు వేయకూడదు......ముందుకే వెయ్యాలి....మీ మొహం మీ మొహంలాగానే పడాలంటే మా స్టూడియో.... అందరి ఫోటో స్టూడియో....టింగ్ టింగ్ టింగ్ ....’ అన్నాడు రాబాబు ఎడ్వ టైజ్‌మెంట్ ధోరణీలో  వాళ్ళని నవ్వించి ఇంప్రస్ చేద్దామని.

‘శబాష్ గురూగారూ.... కస్టమర్లతో అలా చలాకీగా మాట్లాడి ఆకర్షించాలి..... ఆ విషయం గురించే మీకు చెప్పాలని అనుకుంటున్నా ’ అన్నాడు కిష్టయ్య రాంబాబు   చెవిలో.

వాడి మాటలకి రాంబాబు సంతోషించాడు. కానీ అది ఎంతో సేపు లేదు. ఆ అమ్మాయిల ముఖం చూసిన రాంబాబు నీరుకారిపోయాడు.

రాంబాబు మాటలకి వాళ్ళు నవ్వలేదు. సీరియస్‌గా అతని వంక చూసి ముఖముఖాలు చూస్కున్నారు.

నేనేమైనా తప్పుగా మాట్లాడితే క్షమించండి..... అంతేగాని వెళ్ళి పోకండి.... మీరు ఇక్కడ ఫోటో తీయించుకోవాల్సిందే.....’

‘అవును మేడమ్....మీరు ఒక్కసారి మా దగ్గర ఫోటో దిగితే ఇంక జీవితంలో ఫోటో దిగరు’ హుషారుగా అన్నాడు కిష్టయ్య.

‘వేరేవాళ్ళ దగ్గర.... వేరేవాళ్ళ దగ్గర.....’ అంటూ సరిదిద్దాడు రాంబాబు....

వీళ్ళ మాటలు పట్టించుకునే స్థితిలో లేరు వాళ్ళిద్దరూ. సరోజ లక్ష్మికి సైగచేసింది.

‘లక్ష్మి మెల్లగా గుమ్మం వైపు రెండడుగులు వేసి బయటికి తొంగిచూసి కెవ్వుమని కేకేసింది.

'వాడిక్కడే ఆగి మనకోసం అటూ ఇటూ చూస్తున్నాడు' అంది గబగబా సరోజ పక్కకు వచ్చి.

ఎవరండీ అతను?.... అతన్ని కూడా లోపలి కి రమ్మనండి ఫోటో తీసేస్తాను.... పాపం బయటెందుకు నిల్చున్నాడు సిగ్గా?..... ఒరేయ్ కిష్టయ్యా ..... నువ్వు బయటకు వెళ్ళి ఆయనెవరో ఉన్నారట.... లోపలికి తీసుకురా.... అన్నాడు రాంబాబు.

కిష్టయ్య బయటికి వెళ్ళబోయాడు.

లక్ష్మి, సరోజా చెంగున ముందుకు దూకి వాడి చెరో రెక్కా పట్టుకుని వెనక్కి లాగే 'వాడు మావాడుకాదులే..... ముందు మమ్మల్ని లోపలికి తీసుకెళ్ళు' అన్నారు.

నలుగురూ లోపలి గదిలోకి వెళ్ళారు.

కిష్టయ్య చకచక లైట్లు వెలిగించాడు. రాంబాబు కెమేరా రెడీ చేస్కున్నాడు.

'చెప్పండి.... కూర్చుని తీయించుకుంటారా నిల్చునా?.... బస్టాపుల్లా?.... ఏ సైజులో కావాలి....కార్డా, కాబినెట్టా?' అన్నాడు రాంబాబు.

సరోజా, లక్ష్మి ముఖముఖాలు చూస్కున్నారు.

'సారీ అండీ.....మేం ఫోటోలు తీయించుకోడానికి రాలేదు.... అన్నారు ఇద్దరు ఒకేసారి.

'మరి?....'

ఇద్దరమ్మాయిలూ పరిస్థితి వివరించి చెప్పారు.

రాంబాబు నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చుండిపోయాడు. కిష్టయ్య లైట్లన్నీ ఆర్పేశాడు.

'నువ్వెళ్ళి చూసిరావే.....వెళ్ళిపోయి ఉంటాడు....' అంది సరోజ.

లక్ష్మి బయటికి వెళ్ళిపోయాడే....' అంది సంబరంగా.

'అయితే పద....పోదాం....'

నలుగురూ ముందు గదిలోకి వచ్చారు.

'వియ్యార్ రియల్లీ సారీ అండీ.....' అన్నారు మళ్ళీ ఇద్దరూ.

'ఏం పరవాలేదులెండి. మాచేత ఫోటోలు తీయించుకునే అదృష్టం మీకు, మీకు ఫోటోలు తీసే అదృష్టం మాకూ లెదు.....ఏం చేస్తాం.....' అన్నాడు రాంబాబు నిస్పృహగా.

'ఏయ్.... మనం ఓ విషయం మర్చిపోయామే' అంది లక్ష్మి కళ్ళు పెద్దవి చేస్తూ.

'ఏమిటి?'

'ఈ ఆదివారం మనం పిక్నిక్ వెళుతున్నాం కదా.... అప్పుడు మనం ఒకఫోటోగ్రాఫర్‌ని బుక్ చేసుకునిమనకూడా తీసుకెళదాం అనుకున్నాంగా....'

అరెరె.... ఆ విషయమే మర్చిపోయాం .... మనం ఈయన్నే మన కూడా తీసుకెళదాం....' అని రాంబాబు వైపు తిరిగింది సరోజ.

'చుడండీ....'

'రాంబాబు...రాంబాబు....'

‘చూడండీ రాంబాబుగారూ....మేం కాలేజీలో ఫైనలియర్ చదువుతున్నాం.... ఈ సంవత్సరరంలో మా క్లాస్ మేట్స్ అంతా విడిపోతాంకదా... అందుకే విడిపోయేముందు గండిపేటకు పిక్నిక్ ఏర్పాటు చేస్కున్నాం.... అక్కడ ఫోటోలు తీయించుకుందామని నిర్ణయించుకున్నాం. మాలో ఎవరైనా కెమేరా తీసుకొచ్చి ఫోటోలు ఇవి తీసుకోవచ్చనుకోండి....కానీ విడిపోతున్న మా స్నేహితుల జ్ఞాపకార్థం జీవితాంతం ఉండాల్సిన ఫోటోలు ఇవి.... అందుకే మీలాంటి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ తీస్తే బావుంటుందని అనుకుంటున్నాం....’ అంది
సరోజ.

‘వచ్చే ఆదివారంమే పిక్నిక్.... అంది లక్ష్మి.

‘బస్సు సుల్తాన్ బజార్‌లో ఆంధ్రాబ్యాంక్ బిల్డంగ్‌నుండి ఉదయం ఏడుగంటలకు స్టార్టవుతుంది. మీరు అక్కడికి వచ్చెయ్యండి....నా పేరు సరోజ...నేనే ఈ పిక్నిక్ ఆర్గనైజర్ని.....’ అని రాంబాబుకి వందరూపాయలు ఎడ్వాన్స్ ఇచ్చి లక్ష్మిని తీసుకుని వెళ్ళిపోయింది సరోజ.

రాంబాబు కిష్టయ్య ఇద్దరూ క్షణంపాటు ముఖముఖాలు చూస్కుని ‘యాహూ....’ అని అరిచారు.

## *ఫ్రేమ్ - 4*

## *ఎ గ్రాండ్ ఛేజ్ ఇన్ చిక్కడపల్లి*

ఆ ప్రదేశం అంతా కుక్కల భౌభౌకారాలతో మార్మోగి పోతూంది.

వాళ్ళిద్దరూ పరుగెత్తుతున్నారు.... ఆయన ఆయాసపడ్తూ ..... కాళ్ళువెంబడిస్తున్నాయ్.

వాళ్ళవెనకాల దాదాపు డజను కుక్కలు వాళ్ళకి పదిగజాల దూరంలో వెంబడిస్తున్నాయ్.

‘మీరెప్పుడూ ఇంతే గురూగారూ.....’ అన్నాడు వగరుస్తూ కిష్టయ్య.

‘కుక్కలు వెంబడిస్తూంటే మధ్యలో నేనేం చేస్తాను.....’ అన్నాడు రాంబాబు తనూ వగరుస్తూ.

‘మీరు పరుగెత్తుదాం అని అనడంవల్లే కదా గురూగారూ ఈ కుక్కలన్నీ మన వెంటబడ్డాయ్....’

‘మరి పరిగెత్తక?..... వాళ్ళేమో ఏడుగంటలకల్లా సుల్తాన్ బజార్ ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్ దగ్గరనుండి బస్సు బయలుదేరుతుందని అన్నారు...... మనం కనీసం ఆరూ యాభై కన్నా అక్కడ ఉండాలి. ఇప్పుడు టైమ్‌చూస్తేఆరూనలభై అయిదు అయ్యింది.....’

‘అయితే ఇప్పుడు మనం సుల్తాన్ బజారుదాకా పురుగెత్తాల్సిందేనా?’

‘అంతదూర ఎలా పరుగెత్తుతాం .... దార్లో ఆటో ఏదైనా కనిపిస్తే ఎక్కేస్తాం....’

‘రోజూ ఎక్కడబడితే అక్కడ కనబడే ఆటోలు ఈ వేళ ఒక్కటీ కనబడవేం.... పోనీ రిక్షా ఎక్కేద్దామా గురూగారూ.....’

‘రిక్షా ఎక్కితే, వాడు మెల్లగా లాక్కెళ్ళేసరికి పిక్నిక్ బస్సుకాస్తా వెళ్ళిపోతుంది....’
‘అయినా ఆ మాత్రం మనకోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోతారంటారా గురూగారూ....
పైగా వందరూపాయలు అడ్వాన్సుకూడా ఇచ్చారు’
‘ఏమో ఎవరు చెప్పగల్రు.... అయినా మనం టైం మెయిన్‌టైన్ చెయ్యకపోతే మళ్ళీ
ఎప్పుడైనా మనల్ని బుక్ చేస్తారా?....’
‘భౌ....భౌ...’
ఈ కుక్కల అరుపుల్తోనే చెవులు పగిలి చస్తుంటే మధ్యలో నీ అరుపులు కూడానా...నీ
సర్చా చాలుగానీ కుక్కలా అరవడం ఆపు...’ రాంబాబు విసుక్కున్నాడు.
అబ్బే.....ఇప్పుడు కుక్కలా అరిచింది నేనుకాదు గురూగారూ.....’
ఇద్దరూ కంగారుగా వనక్కి చూశారు. దాదాపు వాళ్ళకాళ్ళకి తగిలేంత దగ్గరగా బలిసిన
ఓ కుక్క వెంబడిస్తూంది.
‘భౌభౌ...’
‘ఏయ్ ....ఛీ....ఛీ....’
పరుగు ఆపకుండానే అన్నారు ఇద్దరూ.
‘భౌభౌ.....భౌభౌ.....’ అంది ఆ కుక్క.
కాస్త వెనకాల పరిగెత్తుతున్న్న కుక్కలన్నీ కోరస్‌గా ‘భౌభౌభౌ.....భౌభౌ.....’ అన్నాయి.
‘బాబోయ్..... ఈ కుక్క పిక్కపట్టుకుని కండ పీకేసేలాగుందండి గురూగారూ.....
‘మరేం భయంలేదు....మొరిగె కుక్క కరవదులే....’ అన్నాడు రాబాబు మనసులో
భయపడుతూ.
‘కానీ ఆ విషయం కుక్కకి తెల్సో లేదో గురూగారూ....’
అంతలో ఆ వైపుగా ఖాళీ ఆటో వస్తూ కనిపించింది.
‘ఆటో.....ఆటో.....’ అరిచారు ఇద్దరూ.
ఆటో వచ్చి ఆగింది.
వీళ్ళిద్దరూ కూడా ఆగారు.
వీళ్ళదగ్గరగా వచ్చి కుక్కలు కూడా ఆగాయి.
‘వస్తావా?.....’ అన్నాడు రాంబాబు
‘రాను....’ అన్నాడు ఆటోవాడు.
‘అదేం?.....’
‘అర్రే..... ఇంతమంది సవారీకి ఎట్లకూసుండ బెట్టుకుంటాం సాబ్?’
‘ఎంతమంది....ఇద్దరమేగా?’
‘మల్ల ఈ కుక్కలన్నీ?’